క్లుప్తంగా

చిన్నారులను అంగన్‌వాడీ బడిలో చేర్పించాలి



ఫిరంగిపురం: పాఠశాల ఈడు చిన్నారులను అంగన్‌వాడీ బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలోని బీసీ–2 అంగన్ వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. వారికి ఆటలు, పాటలు, విద్యాబోధన, సాంస్కృతిక అంశాలు వంటివి చెబుతారని పేర్కొన్నారు. వీటి తోపాటు పౌష్టిక ఆహారం కూడా అందిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు గాయత్రి, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎ న్ఎం పాపులమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది మేరీ, హెల్పర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు




మంగళగిరి మాదక ద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల, సీకే జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక ప్రచార వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్‌ను విద్యార్థులతో నిర్వహించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. వక్తలు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, సీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రత్నబాబు, బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి. రమేష్, వి.జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త అవసరం



మేడికొండూరు మండల పరిధిలోని డోగిపర్రు గ్రామంలోని మంచినీటి ట్యాంకు వద్ద తాగునీటికి సంబంధించి పరీక్షలు చేశారు. గ్రామంలో ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు సురక్షితంగా ఉందో, లేదో శాంపిళ్లు తీసినట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. డయేరియా ప్రస్తుత వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలుషిత నీటి ద్వారా పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పంచాయతీ ట్యాంకు ద్వారా సరఫరా అవుతున్న నీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలన్నారు. అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతున్నట్లు తెలిస్తే వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని పేర్కొన్నారు. చిన్నారులకు నీరు తాగించే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి పి.దివ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శర్వాణి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి అభిషేకాలు, వజ్ర కిరీటాలంకరణ, చేశారు. ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గోరంట్ల గ్రామానికి చెందిన కాకి బ్రహ్మేశ్వరరావు, మల్లేశ్వరి దంపతులు శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారికి, శ్రీ పద్మావతి అమ్మవారికి, శ్రీ అండాళ్ అమ్మవారికి మూడు రకాల బంగారు తాపడంతో తయారు చేయించిన హారాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర అప్రమత్తం!

- వానల నేపథ్యంలో పెరుగుతున్న రోగాలు
- ఆసుపత్రులకు ఎక్కువైన బాధితుల తాకిడి
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన
- మలేరియా, డెంగీ ప్రబలకుండా యంత్రాంగం చర్యలు



మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మంగళగిరి :అనారోగ్యానికి కారణాలు ఎన్నయినా.. అందులో ప్రధానమైనవి సీజనల్‌గా వచ్చేవి. ఏదైనా సమస్య వచ్చాక ఆసుపత్రుల చుట్టూ పరుగులు తీసేకన్నా ముందస్తు జాగ్రత్తలే శ్రీరామరక్ష అని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలు, అకస్మాత్తుగా వర్షాలు వంటి వాతావరణ మార్పుల ప్రభావంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

డయేరియాతో ఇబ్బందులు

ముఖ్యంగా ఇటీవల కొన్ని ప్రాంతాలలో డయేరియా విజృంభిస్తోంది. దీనికి సకాలంలో వైద్యం అందకపోతే ప్రాణాలనే మింగేస్తుంది. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో డయేరియా కోరలు చాచి అనేక మందిని ఇబ్బంది పెడుతోంది. నీళ్ల విరేచనాలు, రక్తం పడడం వంటివి డయేరియా లక్షణాలు. జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా మారి కడుపులో మెలిపెట్టినట్టు నొప్పి ఉంటుంది. వాంతులు, విరేచనాలతో శరీరం లవణాలను కోల్పోయి పిక్కల నొప్పులు వస్తాయి. నీరసం, వికారంతోపాటు నోరు, నాలుక పిడచకట్టుకుపోయినట్లు ఉంటుంది. శరీరం నుంచి అధికమొత్తంలో నీరు బయటకు పోవడం వల్ల వయస్సుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు అధిక ప్రమాదం పొంచి ఉంటుంది. డీహైడ్రేషన్‌కు గురైనవారు అశ్రద్ధ చేస్తే ఒక్కోసారి నాడీ వేగం కూడా తెలియదు. రెండు మూడు విరేచనాలు అయినా జాగ్రత్త పడాలి. వెంటనే వైద్యలను సంప్రదించాలి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. అంతేకాకుండా సీజనల్‌గా జలుబు, వైరల్ జ్వరాలు మామూలే. వారం రోజులుగా నగరంలోని ప్రభుత్వాసుపత్రులు, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లకు జలుబు, వైరల్ జ్వరాలతో వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. ప్రధానంగా కలుషిత నీరు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. నీటి నిల్వలతో దోమలు అధికంగా పెరగడం కూడా కారణమవుతోంది. వ్యాధుల నివారణ కోసం చేతులను సబ్బుతో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా కడుక్కోవాలి. మంచి ఆహారం తీసుకోవాలి. బయట ఆహారం తినడం మానుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉండడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగాలి. వేడి ఆహార పదార్థాలనే భుజించాలి. శీతల పానీయాలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటే మంచిది. పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు ఇంటి చుట్టూ మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎవరికైనా దీర్ఘకాలిక వ్యాధులుంటే మరింత అప్రమత్తత అవసరం. చిన్నపిల్లలు డయేరియా బారిన పడకుండా తప్పనిసరిగా రోటా వైరస్ టీకాను ఇప్పించాలి.

రంగంలోకి అధికారులు

నగరంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాలువలలో మురుగు నీరు నిల్వ లేకుండా కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగారు. మురుగు కాల్వలలో పూడిక తొలగింపు పనులు చేయిస్తున్నారు. మలేరియా నియంత్రణ విభాగ అధికారులు కూడా దోమల సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మలేరియా మాసోత్సవాల పేరుతో నిరంతరం ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. డయేరియా, మలేరియాలతోపాటు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను అధికారులు కోరుతున్నారు.

డయేరియా నివారణకు పకడ్బందీ చర్యలు

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ వి.నిర్మల్ కుమార్



ఎనిమిదో వార్డు సచివాలయ పరిధిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నిర్మల్ కుమార్ తదితరులు

మంగళగిరి డయేరియా నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశ హాలులో 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్ – 2024' పేరిట అవగాహనా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డయేరియా నియంత్రణకు అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. నీటి సరఫరాపై పర్యవేక్షణ, నీటి నాణ్యత కోసం ఆర్‌సీహెచ్, ఈకోలా పరీక్షలు నిర్వహించడం, లీకేజీ నివారణ వంటి పనులను నిరంతరం చేపడుతున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లను సమన్వయం చేసుకుని పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, గర్భిణులు, బాలింతలకు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సీడీపీవోకు సూచించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీలలో పూడిక తీయడం, ఫాగింగ్ చేపట్టడం, దోమలు, కీటకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, ఓఆర్ఎస్, జింక్ వినియోగంపై వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలతో కలిసి వార్డు సచివాలయాలు, రాత్రి వసతి కేంద్రాలు, హోటళ్లు, ఇతర ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. తొలుత ఉదయం 5 గంటలకు ఎనిమిదో సచివాలయ పరిధిలో కమిషనర్ పర్యటించారు. పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. సిబ్బంది హాజరు శాతాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుబ్బరాజు, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్, ఏసీడీపీవో సరిత, డీఈ కృష్ణారెడ్డి, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వరరావు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోరంపూడిలో విద్యాశాఖ సిబ్బంది ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడిలో విద్యాశాఖ తరఫున ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లేందుకు విద్యాశాఖ దీన్ని చేపట్టింది. గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ఎస్.సి. పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ – 2 లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ విద్యాహక్కు ప్రతి ఒక్కరిదని తెలిపారు. కొంతమంది చదువుకునేందుకు పాఠశాలకు రాకుండా తల్లిదండ్రులతో పనికి వెళుతున్నారని గుర్తుచేశారు. బడికి వెళ్లబోమని చెబుతున్న వారితోపాటు తల్లిదండ్రులకు చదువుకోవడం వల్ల భవిష్యత్తు లాభాలను వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. మోహన కృష్ణ, ప్రసాద్, హిమబిందు, అనూరాధ, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ దృష్టికి స్వర్ణకారుల సమస్యలు



నారా లోకేష్‌కు మెమెంటో అందజేస్తున్న స్వర్ణకార సంఘ నేతలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని స్వర్ణకారులు తమ సమస్యలను మంగళవారం మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరికి చెందిన లక్ష్మీ నరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ స్వర్ణకార కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. స్వర్ణకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించామన్నారు. నారా లోకేష్ దీనికి సానుకూలంగా స్పందించారని ప్రతినిధులు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుకు విధివిధానాలు, స్వర్ణకారుల సమస్యలపై అధ్యయనం చేసి వివరాలు సమర్పించమన్నారని పేర్కొన్నారు. మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా రూపొందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణకార సంఘ నాయకులు నారా లోకేష్‌కు మెమెంటోను బహూకరించారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు ప్రియాంక

ఫిరంగిపురం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు చాలావరకు దూరమవుతాయని బఫర్ వైద్యురాలు ప్రియాంక అన్నారు. మరీ ముఖ్యంగా భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. మండలంలోని మునగపాడు గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 180 మందికి డాక్టర్ ప్రియాంక షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిశుభ్రమైన వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని చెప్పారు. తాగునీరు శుభ్రంగా ఉండాలని, లేకుంటే విరోచనాలు (డయేరియా) వచ్చే ప్రమాదం ఉందన్నారు. అలాంటి ఇబ్బంది ఎదురైతే సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆశా కార్యకర్తల వద్ద మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం పాపులమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ



వర్మి కంపోస్టు ఎరువుల తయారీ తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్న రైతులు

గుంటూరు రూరల్: పంట దిగుబడులు పెంచడంలో తేనెటీగలు ప్రధాన పాత్ర పోషిస్తాయని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ తెలిపారు. వాటి పెంపకంతో రైతులు అదనపు ఆదాయం కూడా పొందవచ్చని పేర్కొన్నారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటల్లో పరపరాగ సంపర్కానికి తేనెటీగలు బాగా ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత జీవనశైలి, రైతులు పంటల సాగులో ఉపయోగించే విష రసాయనాల వల్ల తేనెటీగలు అంతరిస్తున్నట్లు తెలిపారు. అవి అంతరిస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా ఉండే తేనెటీగలతోపాటు అవకాశం ఉన్న రైతులు కూడా వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా అదనపు ఆదాయం పొందొచ్చని చెప్పారు. వ్యవసాయంలో పంట దిగుబడులు కూడా పెరిగి లాభపడతారని తెలిపారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియసాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై శిక్షణ అందించటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో సేంద్రియ రైతులు మీసాల రామకృష్ణ, శబరీనాథ్, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావులు పలు అంశాలను వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు చాలా వరకు రసాయనాలతో పండించినవే అని పేర్కొన్నారు. రైతులు దిగుబడుల కోసం పిచికారీ చేస్తున్న రసాయన ఎరువుల వల్ల వినియోగదారుల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. సేంద్రియ పంటల ద్వారా రైతుతోపాటు ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని వేంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు మహంకాళి ఆలయ హుండీ లెక్కింపు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను ఉదయం 10 గంటల నుంచి లెక్కించనున్నారు. ఆసక్తి కలిగిన వారు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (స్పెషల్) పాఠశాలలో మంగళవారం ఇద్దరు చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన గుణాత్మక విద్య అందిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. వారి పిల్లలను చేర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా సర్కారు బడులు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏటా భూసార పరీక్షలు చేయించాలి

కాకుమాను: ప్రతి ఏటా సాగుకు ముందు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించి నమూనాల ఆధారంగా పంట వేయాలని ఏఓ బి.సుధారాణి అన్నారు. మండల కేంద్రం పెదనందిపాడులో సోమవారం పలు రైతుల పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఏటా ఈ పరీక్షలు చేయించడం వల్ల భూమిలోని పోషకాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. వాటి ఆధారంగా సాగు చేస్తే ఆశించిన స్థాయి కంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. భూసారాన్ని పెంచేందుకు తప్పని సరిగా పచ్చిరొట్ట ఎరువులు సాగుకు ముందు వేయాలని తెలిపారు. 2024–25కి సంబంధించి మండలంలో కౌలుకు సాగు చేస్తున్న రైతులు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది 3,594 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు



వృద్ధులతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లీలావతి

నగరంపాలెం: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలోని నవీన ఆదర్శ మహిళా మండలి (వృద్ధాశ్రమం)లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి వృద్ధాశ్రమంలో అందిస్తున్న సదుపాయాలు, వారు భుజించే ఆహారాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. సీనియర్ సిటిజెన్స్ చట్టాలు, హక్కులపై వివరించారు. ఎవరికైనా రేషన్, ఆధార్ కార్డులు లేకపోతే గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 0863–2224886కు లేదా రాతపూర్వకంగా తెలియజేయవచ్చునని తెలిపారు. తద్వారా జిల్లా అధికారులతో సంప్రదించి, చట్ట పరిధిలో న్యాయ సహాయం అందించి, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

కొండెక్కిన కొత్తిమీర ధర- కట్ట రూ.50కి చేరిక



మార్కెట్‌లో అమ్ముతున్న కొత్తిమీర

కొనలేకపోతున్నాం....



బయట మార్కెట్‌లో ఇప్పటివరకు సాధారణంగా కట్ట రూ.10కి కొనేవాళ్లం. పెరిగిన ధర వల్ల ఇప్పుడు రూ.50 అంటున్నారు. సగం కట్ట కూడా కొనలేకపోతున్నాం.

– తక్కెళ్లపాటి మాధవి, పోలకంపాడు

తాడేపల్లి రూరల్ : కొత్తిమీర ధర కొండెక్కి కూర్చుంది. వర్షాభావం, పంటమార్పిడి కారణంగా తాడేపల్లి కుంచనపల్లిలో పంట దిగుబడి తగ్గడంతో బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ, గుంటూరు తదితర పెద్ద మార్కెట్‌లలో కూడా కిలో రూ.120కి ధర చేరింది. కొత్తిమీర ధర జనవరిలో కిలో రూ. 30 కూడా పలకలేదు. అనేకమంది రైతులు పంట మార్పిడి చేశారు. అప్పటి నుంచి వేసవికాలం ప్రారంభమయ్యే నాటికి పంట పూర్తిగా తగ్గిపోవడంతో కొరత తీవ్రమైంది. వానలు కూడా అంతగా లేవు. ఈ నేపథ్యంలో హోల్‌సేల్ వ్యాపారులు, దళారులు ప్రస్తుతం బెంగళూరు నుంచి కొత్తిమీరను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడి నుంచి శీతలీకరణ యంత్రాలను అమర్చిన వాహనాల్లో అత్యంత జాగ్రత్తగా జిల్లాకు తరలిస్తున్నారు. ఇది నిల్వ ఉండే అవకాశం తక్కువ. దీంతో వ్యాపారులు వీలైనంత తక్కువగా దిగుమతి చేసుకుని, అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి కొత్త పంట వస్తుందని, అప్పటి వరకూ ఇదే ధర కొనసాగుతుందని వ్యాపారులు అంటున్నారు.

డయేరియాపై అవగాహనా కార్యక్రమం



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దుగ్గిరాల ఆరోగ్యకేంద్ర వైద్యులు తదితరులు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో 'స్టాప్ డయేరియా' పేరిట అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవిబాబు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు విరేచనాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ.. జులై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలలో ఓఆర్ఎస్, మందులు వంటివి అందుబాటులో ఉంచుతామని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు, పిల్లలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రహమున్నీసా, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జానమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వి. సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు జి. శ్రీనివాసరావు, యస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చండి

జిల్లా విద్యాశాఖ అధికారిణి పి.శైలజ



విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న డీఈవో పి శైలజ

గుంటూరు రూరల్: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి పి. శైలజ తెలిపారు. మంగళవారం రూరల్ మండలం 40వ డివిజన్లోని పెద పలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ నివాస ప్రాంతంలోని బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించేందుకు తగిన కార్యాచరణ, చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్, పాఠ్యపుస్తకాలు త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. ఇందులో నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఏర్పడే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా రోజువారీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పిల్లలను బడిలో చేర్పించే క్రమంలో గ్రామస్తుల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.